క్లుప్తంగా

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం

కొమ్మాది: ఎండాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఓ ప్రకటనలో తెలిపారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా ఈ సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి 1 నుంచి 8 వార్డులతో పాటు 98వ వార్డుకు చెందిన కార్పొరేటర్లు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, వార్డు కమిటీ సభ్యులు, మహిళా ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

చికిత్సకు ఆర్థిక సాయం



మోహనరావుకు రూ. 10 వేలు అందిస్తున్న శ్రీరామ్

భీమునిపట్నం: కిడ్నీ వ్యాధిగ్రస్తుని చికిత్సకు భీమిలిలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆర్థిక సహకారం అందించింది. ఇక్కడ ఆటో డ్రైవర్‌గా చేస్తున్న మార్గాన వీర వెంకట మోహనరావుకు కిడ్నీలు దెబ్బ తిని ఇబ్బంది పడుతున్నాడు. ఇతని వైద్యం కోసం ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ రూ. పది వేలు అందించారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులు అందిస్తున్న ఈశ్వరరావు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న 11 మంది విద్యార్థులకు స్థానిక సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు దంపతులు క్రీడా దుస్తులు అందించారు. ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాసపోలమాంబకు విశేష పుష్పాలంకరణ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని 125వ అలంకరణలో భాగంగా మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు అయిదు రకాల పువ్వులు, తులసి మాలలతో అలంకరించారు. విజయనగరం జిల్లా మోపాడ మండలం కొండ్రాజుపేట గ్రామానికి చెందిన కండ్రెడ్డి గౌరిరెడ్డి, రాములమ్మ దంపతులు ఈ అలంకరణకు సహకారం అందించారు. భక్తులకు తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కొండవాలు ప్రాంతంలో జెడ్సీ పర్యటన



కొండవాలు ప్రాంతం పరిశీలిస్తున్న జెడ్సీ, కార్పొరేటర్ తదితరులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస శారదానగర్ కొండవాలు ప్రాంతాన్ని జోన్-2 జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి పరిశీలించారు. కార్పొరేటర్ మొల్లి హేమలత, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి మంగళవారం ఉదయం ఆమె ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు జెడ్సీతో మాట్లాడుతూ కొండచరియలు జారిపడడంతో నివాసాలకు రక్షణ లేకుండా పోతోందని తెలిపారు. గోడ నిర్మించి, తమకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన జెడ్సీ రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అటు వేట.. ఇటు వేలంపాట



తీరంలో మత్స్యకారులు, జనం

చేపల వ్యాపారంతో తీరంలో సందడి ▪ 150కు పైగా పడవలు, తెప్పలతో చేపల వేట ▪ వేలం పాట ద్వారా విక్రయాలు ▪ మత్స్యకార మహిళల చొరవతో దళారులకు చెక్ ▪ మత్స్యకారులకు మంచి లాభాలు

భీమునిపట్నం: భీమిలి సాగర తీరం చేపల వేట, వ్యాపారాలతో సందడిగా ఉంటోంది. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లిరావడానికి ఇక్కడి తీరం చాలా అనుకూలంగా ఉంటుంది. అలాగే, చేపల విక్రయాలకు, ఎగుమతులకు కూడా తీర ప్రాంతం ఎంతో సదుపాయంగా ఉండడంతో ఇక్కడ చేపల వేట, వ్యాపారం కూడా బాగా జరుగుతున్నాయి.

అనుకూలంగా సాగరసంగమ ప్రాంతం

ఇక్కడ గోస్తని నది సముద్రంలో కలిసే ప్రాంతం పడవల రాకపోకలకు సదుపాయంగా ఉంటోంది. భీమిలిలో ఎగువపేట, బోయివీధి, తోటవీధి ప్రాంతాల నుంచి రోజూ సుమారు 150కు పైనే పడవలు, తెప్పల ద్వారా చేపల వేటను సాగిస్తున్నారు. సాధారణంగా అన్ని తీరాల్లో నేరుగా అలలమీదుగా సముద్రంలోకి పడవలు వెళ్లడం, తిరిగి తీరానికి రావడం జరుగుతుంటాయి. అయితే అలలు ఉధృతంగా ఉన్న సమయాల్లో, ముఖ్యంగా తీరానికి వచ్చే సమయాల్లో పడవలు, తెప్పలు అదుపు తప్పి ప్రమాదాలకు గురయ్యే సందర్భాలు ఉంటాయి. దీనివల్ల మత్స్యకారులు ఎంతో నష్టపోతుంటారు. కానీ, ఇక్కడ నది సముద్రంలో కలిసే ప్రాంతం ఉంది కాబట్టి అందులో నుంచి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా వెళ్లి వస్తుంటారు. అలాగే దగ్గరలోని నాగమయ్యపాలెం, అన్నవరం ప్రాంతాలకు చెంది పెద్ద మోటారు పడవలు కూడా ఇదే మార్గంలో వేటకు వెళ్లి వస్తుంటాయి.

మత్స్యకారులందరికీ ఆదాయం

భీమిలితో పాటు చుట్టుపక్కల అనేక ప్రాంతాల నుంచి రోజూ పెద్ద ఎత్తున జనం తీరానికి వచ్చి చేపలను కొంటున్నారు. దాని ద్వారా కూడా వారికి మరింత ఆదాయం లభిస్తోంది. అలాగే, చాలామంది చేపలను కొన్న తరువాత **ఇక్కడ ఉండే కొంతమంది మత్స్యకార మహిళలకు అందివ్వగా వారు వీటిని తరిగి ముక్కలు చేయడంతో పాటు బాగుచేసి ఇస్తారు. దీంతో ఆ మహిళ**లకు ఆదాయం లభిస్తోంది. ఇలా ఇక్కడి తీరంలో చేపల వ్యాపారం బాగా జరగడంతో మత్స్యకారులు చక్కని ఆదాయం పొందుతున్నారు.

గతంలో దళారుల వల్ల నష్టం

ఇంతకు ముందు మత్స్యకారులు తీరానికి తీసుకు వచ్చిన చేపలను సరైన ధరలకు విక్రయించుకునే పరిస్థితులు లేక చాలా నష్టపోయేవారు. అప్పట్లో దళారులు ఎక్కువ మంది ఉండడంతో వారు నిర్ణయించిన ప్రకారమే విక్రయించవలసి వచ్చేది. అలాగే, కొంతమంది మత్స్యకార మహిళలు మెయిన్‌రోడ్డు వద్ద, వీధుల్లో తిరిగి చేపలను విక్రయించేవారు. చాలా సమయాల్లో చేపలు సరిగ్గా లభ్యం కాకపోవడంతో పాటు వచ్చిన కొన్నింటికి సరైన గిట్టుబాటు ధర లేక అందరూ ఇబ్బంది పడేవారు.



చేపలతో తీరానికి చేరుకున్న పడవలు, తెప్పలు



చేపలను తీరానికి తీసుకువస్తున్న మత్స్యకారులు

ఉదయం 7గంటల నుంచి సందడి

మత్స్యకార మహిళల చొరవతో క్రమేపీ దళారుల బెడద తగ్గింది. దీంతో ఇక్కడ చేపల విక్రయాల ద్వారా మంచి లాభాలు వస్తున్నాయి. ప్రతిరోజు రాత్రివేళల్లో ఎక్కువ మంది మత్స్యకారులు వేటకు వెళ్లి, ఉదయం ఏడు గంటల ప్రాంతంలో తీరానికి చేరుకుంటారు. ఇక అప్పుడు తీరంలో సందడి మొదలవుతుంది. ఇక్కడ పెద్ద ఎత్తున వేచి ఉన్న మహిళలు చేపల విక్రయాలను ప్రారంభిస్తారు. వారికి ఉన్న అంచనాల పద్ధతుల ప్రకారం వేలంపాట నిర్వహిస్తారు. అందులో ఎక్కువ ధర పలికిన తరువాత వాటిని విక్రయిస్తారు. ఇక్కడ ఎక్కువగా కానాకడతలు, వంజరాలు, గులివింద, మాగ, కొరమీను, సావడ, కవ్వళ్లు, బొంతలు మొదలైన చేపలు వస్తుండగా వంజరం, కానాకడతలకు మంచి రేటు ఉంటుంది. ప్రతిరోజు చేపల లభ్యతను బట్టి కనీసం రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకు వ్యాపారం జరుగుతుండగా భారీగా చేపలు వచ్చేటప్పుడు రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వ్యాపారం జరుగుతుంది. దీంతో ఇప్పుడు దళారుల సమస్య లేకుండా విక్రయాలు జరుగుతుండడంతో మంచి లాభాలను పొందుతున్నారు.

మంచి ఆదాయం లభిస్తోంది



గతంలోలాగా ఎవరి మధ్యవర్తిత్వం, ప్రమేయం లేకుండా చేపలను విక్రయించుకుంటున్నాం. ఇలా మాకు ఎంతో బాగుంది. దీనివల్ల మంచి ఆదాయం లభిస్తోంది. ఇక్కడ చేపలను పెద్ద మొత్తంలో విక్రయించడంతో పాటు, మామూలుగా ఇళ్లకు తీసుకువెళ్లడానికి కొనుగోలు చేయడానికి వచ్చే వారివల్ల కూడా ప్రయోజనకరంగా ఉంది.

– కల్లుబిల్లి ఎల్లాజమ్మ, మత్స్యకార మహిళ

గొడవల్లేకుండా వ్యాపారం



తీరంలో చేపల విక్రయం అందరికీ ఎంతో సదుపాయంగా ఉంటోంది. మత్స్యకారులు చేపలను పట్టి తీసుకురావడం, అక్కడే మహిళలు వాటిని విక్రయించడం జరుగుతోంది. ఎక్కడా ఎటువంటి గొడవలు గానీ, ఇబ్బందులు గానీ లేకుండా వ్యాపారం జరగడంతో అంతా బాగుంది.

– వాసుపల్లి కొండబాబు, మత్స్యకారుల నాయకుడు

అందరికీ అనుకూలం



ఇక్కడ తీరంలో రోజూ చేపలను విక్రయించడం సదుపాయంగా ఉంది. చాలామంది అనేక ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడంతో అందరికీ అనుకూలంగా ఉంది. ఆదాయం బాగుంది.

– వాదమొదల కృష్ణ, మత్స్యకారుడు

చేపలను వేలం వేస్తున్న మత్స్యకార మహిళలు



నేత్రపర్వం.. దామోదర దీపోత్సవం



ఇస్కాన్‌లో ఆకట్టుకుంటున్న యశోదాకృష్ణులు



హరేకృష్ణ వైకుంఠంలో బాలకృష్ణుని చెక్కరోలుకు కట్టివేసే సన్నివేశం నమూనా వద్ద దీపాలంకరణ

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో కార్తీక దామోదర మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రోజూ సాయంత్రం 4.30 గంటల నుండి 6 గంటల వరకు మంగళహారతి, నర్సింహ హారతి, తులసి హారతి, భగవంతునికి నేతి దీపం సమర్పిస్తున్నారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో రోజూ గజేంద్రస్తుతి, దామోదరాష్టకం, గోపీగీత, శిక్షాష్టకం, పారణం నిర్వహిస్తున్నారు.

హరేకృష్ణ వైకుంఠంలో..

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో దామోదర దీపోత్సవం వైభవంగా జరుగుతోంది. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ దామోదర అనేది శ్రీకృష్ణుని మరోపేరు అన్నారు. దామ అంటే తాడు, ఉదర అంటే పొట్ట అని తెలిపారు. వెన్నను దొంగిలించి కోతులకు పంచి పెడుతున్న బాలకృష్ణుని యశోదమాత శిక్షించదలచి చెక్కరోలుకు కట్టివేసే సన్నివేశాన్ని వివరించారు. అనంతరం భక్తులు హారతి, వివిధ సంగీత వాయిద్యాలతో సంకీర్తన లయబద్ధంగా ఆలపించారు. దామోదర అష్టక భజనా కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. అంబరీష దాస ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

నివాసాల క్రమబద్ధీకరణపై ఆర్డీవో విచారణ

మధురవాడ: ప్రభుత్వ స్థలాల్లో స్థిర నివాసం ఏర్పరచుకున్న, ఇతర రక్షణ లేని నివాసాల క్రమబద్ధీకరణకు చేసుకున్న దరఖాస్తులపై భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్ విచారణ చేశారు. జీవీఎంసీ 5వ వార్డు శివశక్తినగర్ రోడ్డులోని గాంధీనగర్‌లో పాకలు, రేకులు షెడ్ల క్రమబద్ధీకరణకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఆయన మంగళవారం మధురవాడ రెవెన్యూ గ్రామం సర్వే నెంబరు. 27లో కొన్ని చోట్ల విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జీవో నం.30 నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ చేస్తామని చెప్పారు. ఇక్కడ ఖాళీగా ఉన్న కొన్ని కమ్మల పాకలు గుర్తించి, వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు పాల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో విచారణ చేస్తున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

జెడ్పీ సీఈవో ఆకస్మిక పర్యటన

పద్మనాభం: రోడ్లపై చెత్త వేయకూడదని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి సూచించారు. మండలంలోని కొత్త కొవ్వాడలో మంగళవారం ఆయన ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను చెత్త నుంచి సంపద తయారీకేంద్రాల్లో వేయాలన్నారు. రక్షిత మంచి నీటి పథకం పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయా ? లేదా పరిశీలించారు. ఆయన వెంట డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి నిర్మలాదేవి, ఎంపీడీవో కె.రూపేష్, డిప్యూటీ ఎంపీడీవో కె.రమేష్ నాయుడు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

జీడిపిక్కల పరిశ్రమను సందర్శించిన కేజీబీవీ విద్యార్థులు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరులోని ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థినులను ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మంగళవారం జీడిపిక్కల పరిశ్రమకు తీసుకువెళ్లారు. ఒకేషనల్ విద్యా విభాగం టీచర్ స్వరాజ్యలక్ష్మి జీడిపిక్కల పరిశ్రమలో ఉన్న పరిస్థితులతో పాటు పిక్కల నుంచి పప్పు వేరుచేసే విధానం, శుభ్రం చేయడం, గ్రేడింగ్ తదితర వివరాలు ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ షీలా పాల్గొన్నారు.



పరిశ్రమ వద్ద కేజీబీవీ ఇంటర్ విద్యార్థులు

క్షీణించిన పారిశుద్ధ్యం

పీఎం పాలెం: ఆరోవార్డు గాయత్రీ నగర్ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కాలనీవాసులు డయేరియాకు గురైన విషయం తెలిసిందే. అప్పట్లో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో కాలనీని పరిశుభ్రంగా ఉంచారు. కానీ, మళ్లీ కాలనీలో పరిస్థితి అధ్వానంగా మారింది. డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. అధికారులు స్పందించి, వ్యాధులు ప్రబలకముందే చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



కాలనీ ఎంట్రన్స్ బ్లాకు వెనుక పేరుకుపోయిన చెత్త

కూటమి పాలనలో పేదలకు వైద్యం భారం

- వైద్యకళాశాలల ప్రైవేటీకరణపై సమష్టిగా ఉద్యమిద్దాం
- కోటి సంతకాల సేకరణను ప్రతీ గ్రామంలో చేపడదాం
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



'ప్రజా వైద్యం-ప్రజల హక్కు' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, నాయకులు

పద్మనాభం: మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తూ కూటమి ప్రభుత్వం పేదలకు ప్రభుత్వ వైద్య విద్యను, వైద్యాన్ని అందకుండా చేస్తోందని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా చేపడుతున్న కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమంలో పార్టీ కార్యకర్తలందరూ భాగస్వాములు కావాలని కోరారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న కోటి సంతకాల సేకరణ ఉద్యమంపై పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలను దృష్టిలో ఉంచుకుని వైఎస్ జగన్ మోహన రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, వీటిలో ఏడు కాలేజీల భవనాల నిర్మాణం పూర్తి కాగా.. మిగతా 10 వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వీటికి కేటాయించిన రూ.8,500 కోట్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.3,500 కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఇంకా రూ.5వేలు కోట్లు ఖర్చుపెడితే పది కాలేజీలు పూర్తవుతాయన్నారు. అవి పూర్తయితే పేదలందరికీ ప్రభుత్వ వైద్యం చెంతనే అందుబాటులో ఉంటుందన్నారు. వీటిని ప్రైవేటు పరం చేయడం వల్ల పేదలు వేలాది రూపాయిలు వెచ్చించి వైద్యం చేయించుకోలేరన్నారు.

28న భారీ ర్యాలీ

పార్వతీపురంలో విద్యార్థులు పచ్చకామెర్ల బారిన పడగా వారికి పార్వతీపురం, విజయనగరం జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందించే అవకాశం లేక దూరంగా ఉన్న విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించాల్సి వచ్చిందన్నారు. కూటమి పాలనలో ప్రభుత్వ ఆస్పత్రిలో మందులు లేవన్నారు. ఆరోగ్య శ్రీ లేకుండా చేయడంతో పేదలు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యానికి నోచుకోకుండా పోయారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో జనగన్న సురక్ష ద్వారా ప్రజల ముంగిట వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి నిపుణులైన వైద్యులతో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేసేవారన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నియోజకవర్గ స్థాయిలో 50వేల నుంచి 60వేల సంతకాలు చేపట్టి గవర్నర్‌కు అందిద్దామన్నారు. ప్రతి గ్రామంలో తమ కార్యకర్తలు ఈ సంతకాల సేకరణను చేపట్టాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 28న భీమునిపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.

పార్టీ పటిష్టతకు గ్రామ కమిటీలు

పార్టీ మరింత పటిష్టం చేసేందుకు ప్రతి గ్రామంలో ఏడుగురు అధ్యక్షులతో కూడిన గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పద్మనాభం మండలంలో ఉన్న 22 పంచాయతీల్లో 53 గ్రామాలున్నందున 53 కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. దీనిలో భాగంగా ప్రజా వైద్యం-ప్రజల హక్కు , మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సిరుగుడి ఆదినారాయణ, సుంకర బంగారప్పడు, ఈర్ల ఈశ్వరరావు, బోని సన్యాసినాయుడు, పలుగ్రామాల వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు

హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణత

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ-చెన్నై ఆధ్వర్యంలో సెప్టెంబరులో నిర్వహించిన హిందీ పరీక్షలకు హాజరైన భీమిలి ఆదర్శహిందీ ప్రేమీమండలి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణులైనట్లు మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు తెలిపారు. పరిచయ్-26, ప్రాథమిక -4, మధ్యమిక -1, రాష్ట్రభాష -7, ప్రవేశిక - 4 విద్యార్థులు హాజరయ్యారన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని శృంగేరీ శంకరమఠంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయం వెనుక ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్లు, కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన

భీమునిపట్నం: భీమిలిలోని పలు ప్రాంతాల్లో రూ. 80.95లక్షలతో నిర్మించనున్న కాల్వలు, రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలో అవసరమైన ఇతర ప్రాంతాల్లో కూడా రోడ్లు, కాలువలు నిర్మిస్తామని తెలిపారు. అనంతరం 13మంది మత్స్యకారులకు సబ్సిడీపై పడవలకు మోటారు ఇంజిన్లు అందించారు, అనంతర వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీక్ష సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి, కార్యదర్శి లక్ష్మీ చైతన్య, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఈశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

చిన్నారి చికిత్సకు ఓఎస్‌జీ ఫౌండేషన్ చేయూత



పాప తల్లికి ఆర్థిక సాయం అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తగరపువలస: శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం కొఠారి గ్రామానికి చెందిన ఏడాదిన్నర వయసు గల దియా చికిత్స నిమిత్తం ఆనందపురం మండలం గంభీరం గ్రామానికి చెందిన ఓఎస్‌జీ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం రూ.20,300 అందించారు. న్యుమోనియా సోకిన దియాకు ముందుగా రిమ్స్‌లోని వైద్యులు వెంటిలేటర్లపై చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. దియా తల్లిదండ్రులు కూలిపనులు చేసుకుని జీవిస్తుండగా, తల్లి పావని అభ్యర్థన మేరకు ఓఎస్‌జీ ఫౌండేషన్ తరఫున ఈ సాయం అందించినట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దళాయి శివ తెలిపారు.

ఉత్సాహంగా మహిళల రగ్బీ పోటీలు



మైదానంలో ఆడుతున్న జట్లు

భీమునిపట్నం: కేంద్ర ప్రభుత్వం మహిళలను ప్రోత్సహించడానికి రాష్ట్రంలో నిర్వహిస్తున్న 'అస్మిత రగ్బీ లీగ్' పోటీలు మంగళవారం భీమిలి జీవీఎంసీ మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో మొత్తం 12 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన గొనగానపల్లి జట్టు విజేతగా నిలిచింది. గొనగానపల్లి జట్టు 10 గోల్స్ వేసి, గుంటూరు జట్టుపై గెలుపొందింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.